సమాచారం

నేడు, రేపు భోలక్‌పూర్‌లో నీటిసరఫరా బంద్

ముషీరాబాద్: మేకల మండి రిజర్వాయర్ పరిధిలోని భోలక్‌పూర్ డివిజన్‌లో శని, ఆదివారం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని రిజర్వాయర్ సెక్షన్ మేనేజర్ ప్రసాద్ బాబు తెలిపారు. డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌజ్, రంగానగర్, వేంకటేశ్వర కాలనీ, బొంతలబస్తీ, పద్మశాలికాలనీ, గుల్షన్‌నగర్, తాజీర్‌నగర్, అంజుమన్ వీధి, మండి గల్లీ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించారు.

ఉచిత బీఎండీ పరీక్ష

కాచిగూడ: హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాచిగూడ సన్‌షైన్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోకాళ్ల నొప్పుల నివారణకు ఉచిత బీఎండీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఫ్యాషన్ డిజైనింగ్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ రాము ప్రకటించారు. శుక్రవారం నారాయణగూడలోని గ్లోబల్ మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులకు ప్రాధాన్యత పెరుగుతోందని వృత్తివిద్య కోర్సులతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో మహిళలు ఆర్థికంగా స్థిరపడాలంటే ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు చేసిన వారికి అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు.

క్లుప్తంగా...

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: మూసీ పరివాహక ప్రాంతం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని టీఆర్ఎస్ సీనియర్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గోల్నాక డివిజన్‌లో మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజల సమస్యలపై కార్పొరేటర్ దూసరిలావణ్య దృష్టికి రావడంతో ఆమె సూచనల మేరకు ఆయన ఆయా ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. స్థానిక సమస్యలను ప్రజలు ఆయనకు వివరించగా.. జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో చెత్త, చెదారం తొలగించేందుకు చర్యలు చేపట్టారు. బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు.

చీడపీడల నివారణ చర్యలు



చెట్లకు మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

కాచిగూడ: రోడ్లు, దేవాలయాల ఆవరణలో ఉన్న వేప, రాగి చెట్లకు చీడ పురుగులపై ప్రజలు కార్పొరేటర్‌కు విన్నవించారు. స్పందించిన కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్ నింబోలిఅడ్డాలోని మహంకాళీ దేవాలయం, రోడ్లు ఇళ్ల ఆవరణలో ఉన్న చెట్లకు జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు, సిబ్బందితో కలిసి మందును పిచికారీ చేయించారు. బీజేపీ నేతలు బీమ్‌రాజ్, అజిత్‌సింగ్, పన్నాసింగ్, రాజేందర్, రవియాదవ్, ఆర్.సంతోష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేను కలిసిన బీజేపీ నేతలు



కవాడిగూడ: నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డేను బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ అగర్వాల్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుక్రవారం ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ పోలీసులు చేస్తున్న కృషికి అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. దిలీప్, మహేందర్‌రావు, ఆశిష్‌పండిట్, సిక్వాల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్స్, లెక్చరర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కవాడిగూడ: రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్(టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ తెలిపారు.

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలీటెక్నిక్, మెడికల్ కళాశాలల్లో లెక్చరర్స్ విద్యాబోధన చేస్తున్నారన్నారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎల్ఎఫ్ నేతలు

- విద్యారంగానికి ఎంతో సేవచేస్తున్న టీచర్స్, లెక్చరర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.
- ప్రైవేటు లెక్చరర్ల పేర్లను ప్రభుత్వం నమోదు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. సంఘం రాష్ట్ర నాయకులు సైదులు, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు అధ్యాపకుల పాత్ర కీలకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర కీలకమని న్యూ ఏరా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో న్యూ తరంగ్ పేరిట సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసినప్పుడే వారి భవిష్యత్తు ముందుకు సాగుతుందన్నారు. ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యార్థులు తమ ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. కళాశాల డైరెక్టర్ ఎల్.వీ.రమణారెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సీఐ సంజయ్‌కుమార్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించిన విద్యార్థులు

పాఠశాల వార్షికోత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నల్లకుంట, బర్కత్‌పురా, హిమాయత్‌నగర్ వార్షికోత్సవం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ ఓఎస్‌డీ శ్రీనివాస్ కుమార్ హాజరై మాట్లాడారు. పిల్లలు కౌమార దశ నుంచే ఎంతో ఆలోచనాత్మకంగా వృద్ధిలోకి రావడానికి మంచి మార్గాన్ని ఉపాధ్యాయులు వేయాలని సూచించారు. స్కూల్ నల్లకుంట ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, బర్కత్‌పురా ప్రిన్సిపాల్ సవిత, హిమాయత్‌నగర్ ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కళా తపస్వి విశ్వనాథ్‌కు నివాళి

కాచిగూడ: సంప్రదాయ తెలుగు సినిమా దర్శక, నటుడు విశ్వనాథుడికి పాస్ ఫిలిం సొసైటీ బర్కత్‌పుర కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సంస్కృతిరత్న కె.ధర్మారావు అధ్యక్షతన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగువారు గర్వపడే ఒక ఉత్తమ దర్శకుడని అన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయ కళలు, సంగీత, సాహిత్యం సహజత్వాన్ని సినిమాకు జోడించి మన తెలుగు సినిమాను విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. సంస్థ ప్రతినిధులు యుగంధర్, మంత్రి భుజంగరావు, హస్తకళా శిరోమణి డాక్టర్ కమల ప్రసాదరావు, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, కేఎస్ మూర్తి, లక్ష్మీమణిమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో..

నల్లకుంట: టాలీవుడ్ లెజెండ్ డైరెక్టర్, దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత, కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ మృతి పట్ల తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శుక్రవారం నల్లకుంటలోని టీబీఎస్ఎస్ కార్యాలయంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు విశ్వనాథ్ చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. భారత చలన చిత్ర రంగంలో కళల సాహిత్యతను, సాహిత్య మూలాలను ఎప్పటికప్పుడు చాటి చెబుతూ.. అర్ధ శతాబ్దం పాటు అలుపెరగని పోరాటం చేసిన విశ్వనాథ్‌కు అశ్రునయనాలతో నివాళులు అర్పిస్తున్నామన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, జిల్లా అధ్యక్షుడు సునీల్, అశోక్‌కుమార్, ప్రచార కార్యదర్శి పురుషోత్తమరావు, బాలు, దేశ్‌ముఖ్ రమాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు చిత్రపరిశ్రమకు తీరని లోటు..

కాచిగూడ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతం, మానవ సంబంధాలు, అనుబంధాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. అనేక చిత్రాలు రూపొందించిన ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు కె.విశ్వనాథ్ మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్వనాథ్ మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ.. ఆయన కుటుంబసభ్యులు, అభిమానులకు సానుభూతిని తెలియజేశారు. కేశబోయిన శ్రీధర్, సూర్య ప్రకాష్‌సింగ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర పరిశ్రమల విభాగం కన్వీనర్ పార్థసారథి పిలుపునిచ్చారు. మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా మీడియా విభాగం కన్వీనర్‌గా కర్నంబాబు, జిల్లా ఎన్విరాన్‌మెంట్ సంయుక్త కన్వీనర్‌గా వేణుగోపాల్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రామ్‌తో కలిసి నియామకపత్రాలను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా పని చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు తప్పక లభిస్తుందన్నారు.

మాస్టర్ ప్లాన్ 2031 నివేదికను అమలు చేయాలి

ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో పెరుగుతున్న జనాభాకు అనగుణంగా గత ప్రభుత్వాలు రూపొందించిన మాస్టర్ ప్లాన్ 2031 నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి కోరారు. ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో గురువారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదం సంఘటనా స్థలాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2031 మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలో జనావాసాల మధ్య ఉన్న పరిశ్రమలను 2004లో శివారు ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. లీజు పేరుతో విలువైన ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకునేందుకు కొందరు యత్నిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఫైర్ శాఖల్లో నిబంధనలు అమలు కావడం లేదన్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ నిద్రపోతోందన్నారు. విశాలమైన స్థలాలున్న హైదరాబాద్‌లో 42 అంతస్తుల భవనాలు ఎలా నిర్మిస్తారని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రాణిగంజ్, ఆజామాబాద్, నూతన సచివాలయంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని రాజకీయ పార్టీలు, ఎన్జీవో, పర్యావరణ వేత్తలు, సైంటిస్టులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో ఫోన్‌లో మాట్లాడి నివస ప్రాంతాల్లోని పరిశ్రమలను తరలించాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగంగుప్తా, కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కన్నా డానియేల్, రామకృష్ణ, ఎస్సీ సెల్ చైర్మన్ రాజు, జగన్, నర్సింహ తదితరులు ఉన్నారు.



ఆజామాబాద్‌లో అగ్ని ప్రమాద స్థలాన్ని సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి తదితరులు

పరామర్శ ..

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఐడీఎల్ కార్మిక యూనియన్ నాయకులు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి పరామర్శించారు. డానియల్, రాజు, లింగంగుప్తా, రామకృష్ణ తదితరులున్నారు.

బడ్జెట్‌ను బీసీలకు రూ.12 వేల కోట్లకు పెంచాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బీసీల బడ్జెట్‌ను రూ.12వేల కోట్లకు పెంచాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. గతేడాది బీసీల సంక్షేమానికి ప్రభుత్వం రూ.5,698 కోట్లు కేటాయించిందని దీన్ని రెట్టింపు చేయాలన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీ బంధును ప్రకటించి బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లను ప్రత్యేకంగా కేటాయించాలన్నారు.

- బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం రూ.3 వే ల కోట్లను ఇవ్వాలని బీసీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించేందుకు రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలన్నారు.
- పోటీ పరీక్షల శిక్షణకు బీసీ స్టడీ సర్కిళ్లకు రూ. 1000 కోట్లను ఇవ్వాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

- ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లను ఇవ్వాలని బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించాలన్నారు. బీసీ మహాసభ నేతలు భూషణ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, ధీరేంద్రయాదవ్, నవీన్‌గౌడ్, నర్సింగ్, సాంబశివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మందనవీన్, ప్రధాన కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు విద్యారంగానికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలు చేయాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలకు సరిపడ నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ధర్నా

అంబర్‌పేట: పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. పేదలకు తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వాలంటూ శుక్రవారం అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఐద్వా, డీవైఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాకు హాజరై ఆయన మాట్లాడుతూ... డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కోసం రూ.9 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆన్‌లైన్‌లో విచారణ చేపట్టి ఇళ్లు కేటాయించడం లేదని మండిపడ్డారు. నగర ప్రజల కోసం ఆయా ప్రాంతాల్లో నిర్మించిన లక్షా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను వచ్చే ఉగాదిలోపు లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ఎం.వెంకటేష్, రాములు, డీఎల్.మోహన్, ధన్‌రాజ్, సుబ్బారావు, రహీస్, సహదేవ్, భూషణం వినోద్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం ప్రతి కుటుంబానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. పూర్తయిన ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఫిబ్రవరి 9న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, ఐద్వా నగర కార్యదర్శి పద్మ, మత్స్యకార సంఘం నగర కార్యదర్శి శ్రీరాములు, సీఐటీయూ కార్యదర్శి హైదరాబాద్ సహ కార్యదర్శి విమల, సీఐటి నాయకులు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్లో సెల్‌ఫోన్ చోరీ.. కేసు నమోదు

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను దుండగులు ఎత్తుకెళ్లారని కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫయాజ్ (40) ప్రైవేట్ ఉద్యోగి కాగా.. హజ్మీర్ - కాచిగూడ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తున్న క్రమంలో సఫీబాబాద్ జంక్షన్ సమీపంలో సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో శుక్రవారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.వారు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం హజ్మీర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

బీజేవైఎం నేతకు మాతృవియోగం

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ బీజేవైఎం ఉపాధ్యక్షుడు సుదాన్షు తల్లి కె. ఎల్.మహేంద్ర(73) అనారోగ్యంతో శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఆమె మృతిపట్ల బీజేపీ రాష్ట్ర నాయకులు కె.పరిమళ్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, పరశురాం, దిలీప్‌యాదవ్, వేణు తదితరులు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి: హాస్య బ్రహ్మ శంకరనారాయణ దేశ విదేశాల్లో ఎన్నో హాస్యావధానాలు చేసి తెలుగు వారిని నవ్వుల్లో ముంచెత్తారని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదరగుప్తా అన్నారు. ఆయన రచించిన 'విదేశాల్లో హాస్యావధానం' గ్రంథాన్ని చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో శుక్రవారం ఆవిష్కరించారు. శంకరనారాయణ పాత్రికేయుడు, కవి, కళాకారుడిగా ప్రసిద్ధి చెందారన్నారు. కళాజనార్దనమూర్తి, ప్రముఖ న్యాయవాది తోట శ్రీలక్ష్మి, సెన్సార్‌బోర్డు సభ్యులు చంద్రశేఖర్, పాటల రచయిత విశ్వేశ్వర్‌రావు, శ్రీమణి తదితరులు హాస్యావధాని, కవిగా శంకర్‌నారాయణ పేరు తెచ్చుకోవడం తమకు సంతోషంగా ఉందన్నారు. ఈ గ్రంథాన్ని అమెరికాలోని న్యూయార్క్ తెలుగు సంఘం మాజీ అధ్యక్షులు అశోక్ ప్రచురించారని ఆయనకే ఈ గ్రంథాన్ని అంకితమిచ్చానని రచయిత పేర్కొన్నారు.

పొగాకు నియంత్రణకు 20 ఏళ్లుగా కృషి !



కాచిగూడ: పొగాకు నియంత్రణకు పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ గత 20 ఏళ్ల నుంచి కృషి చేస్తున్నారు. ఆయన ద్విచక్ర వాహనంపై 'స్మోకింగ్ కిల్స్, క్విట్ టుబాకో' సందేశంతో రాష్ట్రవ్యాప్తంగా 5వేల కిలోమీటర్లు ప్రయాణించి, 500 గ్రామాల్లో వేలాది మందిని పొగాకు, ధూమపానం మానేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సైతం అందుకున్నారు. శుక్రవారం ఆయన నగరంలోని కాచిగూడ ప్రాంతంలో ఇలా బైక్‌పై తిరుగుతూ సాక్షి కెమెరాకు చిక్కారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రూ.8.07 లక్షలతో వీడీసీసీ రోడ్డు పనులు

చిక్కడపల్లి: రూ.8.07లక్షలతో వీడీసీసీ రోడ్లను ప్రారంభించినట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఉల్లిగడ్డ బస్తీలో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ డీఈ సన్నీకి ఫోన్‌లో సూచించినట్లు సమాచారం. 15 రోజుల్లో నూతన రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, నవీన్‌కుమార్, సురేందర్, శ్రీనివాస్, హర్ష, శివకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

రూ.27 లక్షలతో అంబర్‌పేట్‌లో డ్రైనేజీ పైప్‌లైన్..

నల్లకుంట: అంబర్‌పేట్‌లోని అన్ని ప్రాంతాల్లో నూతన డ్రైనేజీ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ మదర్ డెయిరీ పార్క్‌లేన్‌లో రూ. 27 లక్షలతో నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్లలో ఇప్పటికే చాలా ప్రాంతాల డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించామన్నారు. తిలక్‌నగర్‌లో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యలు ఎక్కువ అవుతున్నాయని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కొత్త డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నల్లకుంట కార్పొరేటర్ అమృత, బీఆర్ఎస్ నాయకులు గోనే ప్రదీప్‌రావు, దివాకర్ రావు, నరేందర్, విజయేంద్రసాగర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడీసీసీ రోడ్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్